క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



స్వామివారికి పాలాభిషేకం చేస్తున్న ఈఓ రామకృష్ణ

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్టిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి పాలాభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునిమొక్కులు తీర్చుకున్నారు.

జియో స్పేషియల్ టెక్నాలజీపై అవగాహన



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త విజయేందర్‌బుసిరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో జియో సైన్స్ అండ్ రిమోట్ సెన్సింగ్ సొసైటీ విభాగంలో శనివారం జియో సెషియల్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. టెక్నాలజీ డీ ప్లానింగ్ ద్వారా టెక్నాలజీ ఎలా ఉపయోగించాలనే విషయాలను ఇస్రో శాస్త్రవేత్త విజయేందర్ బుసిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, రామిరెడ్డి, నరసింహులు, సునందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాణ్యం: ప్రతిఒక్కరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీపీ ఉసేన్‌బీ సూచించారు. మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మత్తు – అఘాయిత్యాలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యశించాలని, అప్పుడే ఉన్నతంగా అభివృద్ధి చెందుతారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకే ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

పాణ్యం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం పాణ్యం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఆయా ట్రాన్స్‌కో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే సోలార్ వలన కరెంట్ బిల్లును తగ్గించుకోవచ్చన్నారు. ఇప్పటికే సోలార్ వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నట్లు తెలిపారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ సమీపాన కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామివారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణదొడ్డితోపాటు సి.బెళగల్, బురాన్ దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల తదితర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి అదృశ్యమైంది. తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య శనివారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు రోళ్లపాడు గ్రామానికి చెందిన రెడ్డిపోగు సంధ్యారాణి 5వ తేదీ ఉదయం నుంచి కనపడుడంలేదు. బంధువులు, స్నేహితును విచారించినా ఆచూకీ తెలియలేదు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు రైల్వే స్టేషన్ శివారులోని తుంగభద్ర బ్రిడ్జిపై రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి నదిలోని నీటిలోకి పడిపోయాడు. గుంటూరు నుంచి కాచిగూడకు వెళ్లే ట్రైన్ ఢీకొనగా నీళ్లలో పడిపోయినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం క ర్నూలు రైల్వే పీఎస్ ఎస్ఐ కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచాడు. సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉండి 40 సంవత్సరాల వయస్సు ఉంటుంది. నీటిలో మునిగిపోవడం వల్ల ముఖం, శరీరం మొత్తం ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా ఉంది. ఎరుపు రంగు పాలిస్టర్ ఫుల్ షర్టు, నలుపు, ఎరుపు రంగు గల నైట్ ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 94406 27654 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కిరణ్ కుమార్ కోరారు.

శిథిలావస్థలో పశువైద్యశాలలు

- భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు
- వేధిస్తున్న మందుల కొరత.. ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు

కర్నూలు (రూరల్) : మూగజీవాలకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయితే జూనియర్ వెటర్నరీ పశువైద్యులతో సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా మందుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యేకించి కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం, పడిదెంపాడు, జి సింగవరం పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. పశువుల డాక్టర్లు, సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం డాక్టర్లు కూర్చోడానికి వసతులు కరువైన పరిస్థితి నెలకొంది. జి.శింగవరం, గార్గేయపురం గ్రామాల్లోని పశువైద్యశాలలు పురాతనమైనవి. ఇప్పుడా.. అప్పుడా అనేట్లుగా ఉంది ఈ భవనాల పరిస్థితి. గోడలు బీటలు బారాయి. ఒరిగిన గోడలకు కట్టెలు పోటు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం కురిస్తే నీరు లోపలికి వస్తుంది. ఈదురుగాలులు వీచినప్పుడు భవనం కూలుతుందేమోనని వణికిపోతుంటారు సిబ్బంది. భయాందోళన మధ్య విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఇక పడిదెంపాడు గ్రామంలోని పశువైద్యశాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ భవనం శిథిలం కావడంతో అంగన్‌వాడీ భవనానికి చెందిన ఓ గదిలో పశువైద్యశాల కొనసాగిస్తున్నారు. అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. పశు వైద్యశాలు సక్రమంగా లేకపోవడం, మందుల సరఫరా అంతంత మాత్రానే ఉండడంతో పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో గార్గేయపురం, శివరామపురం, దిగువపాడు, పడిదెంపాడు, పూడూరు, జి సింగవరం గ్రామాల పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు మండలంలో బర్రెలు, ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెలు దాదాపు 2,30,822 ఉన్నట్లు వైద్యుల సమాచారం. పెద్దఎత్తున మూగజీవాలు ఉన్నా వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆయా గ్రామాల పశుపోషకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.



జి.సింగవరం పశువైద్యశాల గోడలకు పగుళ్లు ఇచ్చిన దృశ్యం



గోడలు పడిపోకుండా దూలాలు అడ్డుపెట్టిన దృశ్యం



గార్గేయపురంలో శిథిలావస్థలో పశువైద్యశాల

మందులు బయటకు రాస్తున్నారు



పశువులకు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు మందులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం పశువైద్యశాలలో మందులు లేవని చెబుతున్నారు. ప్రైవేటుగా కొనితెచ్చుకోవాలని డాక్టర్ చీటీలు రాసి ఇస్తున్నారు. తప్పని పరిస్థితులో కొనాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామంలోని పశువైద్యశాల పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. ఈ వైద్యశాలలోకి రావాలంటేనే భయంభయంగా ఉంటుంది.

– జమ్ములన్న, పాడి రైతు, జి.సింగవరం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జి.సింగవరం గ్రామ పశువైద్యశాల సమస్య మా దృష్టికి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పశువైద్యశాలను నిర్మిస్తాం. గ్రామాల్లో పశు వైద్యాధికారులు విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. మందుల కొరత సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.

– జి.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం(2003–2004 10వ తరరగతి) ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ బలరాముడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు దాదాపు రూ.82 వేలుతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు మంచినీటి మినీ ట్యాంక్‌లను పూర్వ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ప్రారంభించారు. విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ విమలకుమారి, చిన్నటేకూరు ఐఐటీ/నీట్ అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, పూర్వ ఉపాధ్యాయులు పీడీ చంద్రశేఖర్, గంగాధర్, రంగస్వామి, రామకృష్ణ, వెంకటస్వామి, మద్దిలేటి, దౌలసాహెబ్, మునయ్య తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు, అధ్యాపకులు చింతలయ్య, ఉపాధ్యాయుడు రవి కుమార్, పూర్వ విద్యార్థులు రంగరాజు నాయుడు. సురేష్, నారాయణ, రాజేష్, దేవరాజు, బాలుగ్రాం తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నూతన శాఖ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ టీజీ నగర్ నూతన శాఖను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం ఆ శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి ఆధ్వర్యంలో యువకులు సమావేశమై నూతన శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నవీన్‌కుమార్, అఖిలలు వ్యవహరిస్తారు. త్వరలోనే శాఖ కార్యవర్గాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బాబయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తాం

- డ్వామా పీడీ వెంకటరమణయ్య



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

కల్లూరు: జాబ్ కార్డు కలిగిన కూలీలకు తప్పనిసరిగా పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకట రమణయ్య సిబ్బందిని ఆదేశించారు. కల్లూరు మండల పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో జరుగుతున్న పీడర్ ఛానల్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ ఉపాధి కూలీలతో మాట్లాడారు. దినసరి వేతనం ఎంత వస్తుంది... గిట్టుబాటు అవుతుందా లేదా అని ఆరా తీశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపడితే రోజువారీ వేతం లభిస్తుందన్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల గురించి ఏపీఓ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఈ సందర్భంగా ఏపీఓకు సూచించారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం కోడుమూరులోని ఉపాధి కార్యాలయాన్ని పీడీ వెంకటరమణయ్య తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల తీరుపై ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్‌బాషాతో చర్చించారు. ప్రస్తుతం ఎంతమంది కూలీలు వస్తున్నారు, ఎక్కడెక్కడ పనులు చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అలాగే ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న మినీ గోకులాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు 6రోజుల పనికి 6రోజుల వేతనం వచ్చేలా పని ప్రదేశంలో మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని ఏపీఓను పీడీ ఆదేశించారు. ఈ ఏడాది ఇచ్చిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పీడీ సిబ్బందిని హెచ్చరించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ జమివుల్లా



బహుమతి అందజేస్తున్న డీఎస్పీ

కల్లూరు: విద్యార్థి దశ కీలకమని, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జెడ్పీ సీఈఓ నాసరెడ్డి, ఆర్డీఓ సందీప్‌కుమార్, డీఎస్పీబాబు ప్రసాద్ సూచించారు. శనివారం కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు జిల్లా ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు. రాజీవ్ గృహకల్ప కాలనీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్ ఎల్ భాస్కర్ పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు.

కల్లూరు: విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. శనివారం కల్లూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హుస్సేన్, ఉపాధ్యాయులు జయప్రద, అజీజ్, వెంకటేశ్వర్లు, కడుబూరు చంద్రశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విజయ గోపాల్, ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని నంద్యాల జిల్లా డీపీఓ జమివుల్లా సూచించార. పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తమ పిల్లలు ఎంత వరకు చదువుతున్నారు, ఏ విధంగా క్రమశిక్షణ కలిగి ఉన్నారు, తదితర విషయాలను తల్లిందండ్రులు స్వయంగా పాఠశాలకు వెళ్లి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్ణానాయక్ , ఎంఈఓ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

–అలాగే పాణ్యంలో నిర్వహించిన తల్లిందండ్రుల సమావేశానికి ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి హాజరైయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరీ సునీతా, సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, జిందాల్ సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, ఎస్ఐ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాల్లో కస్తూర్బా ఏఎస్ఓ రుబీనా, హెచ్ఎం విక్టర్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: తల్లితండ్రులను విద్యార్థులు దైవంతో సమానంగా భావించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ×తల్లి తండ్రులు– ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్, ఏపీ మోడల్ స్కూళ్లలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు హాజరయ్యారు.

అంతా ప్రచార ఆర్భాటమే...!

పాణ్యం: కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్– టీచర్ డే కార్యక్రమం అంతా ప్రచార ఆర్భాటమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగైదు రోజుల నుంచి తల్లిండ్రులకు సమాచారం అందిస్తున్నప్పటికీ 50శాతానికి మించి హాజరు కాకపోవడం ఇందుకు సాక్ష్యం. ఒక వైపు ఆయా పాఠశాలలకు కేటాయించిన అధికారులు విద్యార్థుల సంఖ్యకు తక్కువగా తల్లిందండ్రులు రావడంతో విస్మయానికి గురైయ్యారు. కేవలం బ్యానర్లు, పాఠశాల ఎదుట ముగ్గులు, ఇతర అలంకారనలకే పరిమితం చేశారు. అధికారులు ఫొటోలు తీసి అప్లోడ్ చేసి మధ్యాహ్నం వరకు ఉండి వారితో భోజనాలు చేయించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్లా విద్యార్థుల తల్లిందండ్రులు ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు ముఖం చూపించి పని ఉందటూ వెళ్లిపోయారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్



మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

కోడుమూరు రూరల్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని.. చక్కగా చదువుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. శనివారం కోడుమూరులోని బాలికల హైస్కూల్లో హెచ్ఎం నాగరాజకుమారి నిర్వహించిన పేరెంట్స్ డే మీటింగ్‌కు సీఐ తబ్రేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలను తరచూ సందర్శిస్తుండాలని, తమ పిల్లల చదువు, నడవడికపై ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. అంతకుముందు కోడుమూరులోని బాలుర హైస్కూల్, మోడల్ స్కూల్లో జరిగిన పేరెంట్స్ డే కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ తైమూర్‌బాషా పాల్గొని చదువు ప్రాముఖ్యతను వివరించారు.

గూడూరులో...

గూడూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్ డే మీటింగ్‌లను నిర్వహించారు. కార్యక్రమాల్లో గూడూరు తహసీల్దార్ రామాంజినేయులు, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓలు సునీలమ్మ, నాగరాజు పాల్గొని చదువు ప్రాముఖ్యతను వివరించారు.

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శనివారం మండలంలోని పోలకల్, సి.బెళగల్ జెడ్పీ పాఠశాలలు, గురుకుల, మోడల్ స్కూళ్లలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు రమ, అజీమ్‌బాష, బలరాముడు, వంశీమోహన్‌లు ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యాక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులలో ప్రతిభ కనపరచాలన్నారు. మండల కేంద్రం సి.బెళగల్లో రెగ్యులర్, కోట ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు కిషోర్‌కుమార్, హనుమన్న తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా ఆటల పోటీలను, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాలలో ఎంఈఓ జ్యోతి, ఆదామ్‌బాషా, సి.బెళగల్, కొత్తకోట సర్పంచ్‌లు పాండురంగన్న, శ్రీనివాసులు, హెచ్ఎంలు, టీచర్లు, ఎస్ఎంసీ చైర్మన్లు గోవిందు, తిప్పన్న, ఖాజా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్నూల్(రూరల్): మండల పరిధిలోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తాగిరి హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. అదే విధంగా గార్గేయపురంలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్ ఏసేపు మాట్లాడారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజమ్మ

కోడుమూరు రూరల్ : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ పిలుపునిచ్చారు. గూడూరు మండల పరిధిలోని కె.నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల మూలంగా కలిగే అనర్థాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ బాలికలకు యుక్తవయసు వచ్చాకే వివాహాలు చేయాలన్నారు. చిన్న వయసులో వివాహాల వలన బాలికలు శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల్లో అనారోగ్యం, రక్తహీనత ఏర్పడి పుట్టిన బిడ్డలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఎవ్వరైనా బాల్య వివాహాలు చేస్తుంటే అడ్డుకోవాలి, తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణారెడ్డి, మహిళా పోలీస్ సునీత, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



పెసరవాయిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గడివేముల: అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసర వాయిలో పికెట్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ న్యాయం జరగకపోతే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఉపేక్షించమని, దండన తప్పదన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోకి కొత్త వారు వచ్చినప్పుడు నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: స్థానిక బీ క్యాంపు విజ్ఞాన్ మందిర్ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలలో ఆదివారం విద్యుత్ కోతలు ఉంటాయని ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల్లో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.